క్లుప్తంగా

ఘనంగా వినాయక ఆలయ ప్రారంభోత్సవం



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, తదితరులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో శ్రీవరసిద్ధి వినాయక ఆలయ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, తదితరులు హాజరై గణనాథుడిని దర్శించుకున్నారు. ఆలయంలోని వినాయక, సాయినాథ, కోదండ రాములకు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా శ్రీరామదాసు జయంతి



శ్రీరామదాసు కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

ఆరిలోవ: ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ కళాశాలలో బుధవారం భద్రాచలం శ్రీరామదాసు జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని కళాశాల యాజమాన్యం, చైతన్య అన్నమయ్య మ్యూజిక్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా భక్తులు రామదాసు నవరత్న కీర్తనలు ఆలపించి భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు ఆచార్య ఎస్.రజని, డైరెక్టర్ డాక్టర్ అయ్యంగారి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు ఇలా వదిలేస్తారు?

- ఆరిలోవలో నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



ఆరిలోవ కాలనీలో నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

ఆరిలోవ: జీవీఎంసీ నిధులతో ఆరిలోవ కాలనీలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మిగిలింది. రూ.లక్షలు ఖర్చు చేసి అత్యవసరంగా నిర్మించిన ఈ కాంప్లెక్స్‌ను అధికారులు ఇంత వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో షాపులు నిర్వహించాల్సిన ఈ కాంప్లెక్స్ ఆకతాయిలకు నిలయంగా మారిపోయింది. ఆరిలోవ కాలనీ 13వ వార్డు పరిధి కనకమహాలక్ష్మీనగర్‌ను ఆనుకొని ప్రభుత్వానికి చెందిన సుమారు అరెకరం ఖాళీ స్థలంలో జీవీఎంసీ అధికారులు 2018లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఇక్కడ సుమారు రూ.50 లక్షలు నిధులతో 42 షాపులు నిర్మించారు. ఈ షాపుల్లో కూరగాయలు, ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి అప్పట్లో అధికారులు సన్నాహాలు చేశారు. 2019 నాటికి దీని నిర్మా ణం పూర్తయింది. అప్పటి నుంచి అధికారులు దీన్ని ప్రారంభించకుండా వదిలేశారు. వ్యాపారులు ఎవ్వ రికీ కేటాయించలేదు. దీంతో ఈ కాంప్లెక్స్ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. మరోవైపు ఈ కాంప్లెక్స్ కాలనీ శివారున ఉండడంతో రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. దీనికి వైన్ షాపు దగ్గరలో ఉండడం వల్ల మందుబాబులు ఇక్కడే మద్యం సేవిస్తూ ఓపెన్ బారుగా మార్చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి అని తేడా లేకుండా ఇక్కడ మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. సుమారు నాలుగేళ్లుగా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. ఇంకెన్నాళ్లు ఇలా ఉంచుతారని ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అనాథ శవానికి పోలీసుల అంత్యక్రియలు



బిచ్చగాడి మృతదేహాన్ని స్థానికుడి సహాయంతో శ్మశానానికి తీసుకెళుతున్న ఆరిలోవ పోలీసులు

ఆరిలోవ: హనుమంతవాక వద్ద మృతి చెందిన ఓ అనాథ మృతదేహానికి ఆరిలోవ పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. హనుమంతవాక ప్రాంతంలో ఓ వ్యక్తి కొన్నాళ్లుగా యాచన చేస్తుండేవాడు. రాత్రి వేళ అదే ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపైన, బడ్డీల పక్కన నిద్రపోయేవాడు. రెండు రోజులుగా నీరసించి హనుమంతవాక కూడలి వద్ద ఫుట్‌పాత్‌పై కదలకుండా ఉండిపోయాడు. బుధవారం మధ్యాహ్నం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సచివాలయం సిబ్బంది అక్కడికి వెళ్లేసరికి ఆయన కొన ఊపిరితో ఉన్నాడు. ఈ విషయాన్ని ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చేసరికే ఆయన మృతిచెందాడు. మృతుడికి సంబంధించిన వివరాలు ఏమీ తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా భావించారు. స్థానిక యువకుల సహాయంతో పోలీసులే ఆ మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. దీంతో పోలీసుల సేవలను స్థానికులు అభినందించారు.

మాతా, శిశు మరణాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతా, శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. మాతా, శిశు సంరక్షణ బాధ్యతలు ఆశా కార్యకర్తలదేనని చెప్పారు. గర్భిణుల వివరాలు నాలుగు వారాల్లో నమోదు చేయాలని, కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేటట్టు ప్రోత్సహించాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో 108 వాహనంలో సమీప ఆస్పత్రికి తరలించాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త తమ పరిధిలోని గృహాలను సందర్శించి, ఆయా కుటుంబాల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆశా కార్యకర్తలు 10 ప్రెగ్నెన్సీ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించి, ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సత్యవతి, కె.ధర్మేంద్ర, వై.స్వర్ణలత, ఇతర అధికారులు లక్ష్మి, మణికుమారి, బి.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విష్ణు సహస్ర నామ పోటీలు



విజేతలతో హెచ్‌డీపీపీ ప్రతినిధులు

ఆరిలోవ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా పాఠశాలల విద్యార్థులకు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం విష్ణు సహస్రనామ పోటీలు నిర్వహించారు. 10 సంవత్సరాలలోపు పిల్లలకు అచ్యుత అష్టకం కంఠస్థం పోటీలు, 10 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల విద్యార్థులకు విష్ణు సహస్ర నామ స్తోత్రం కంఠస్థ పోటీలు జరిపారు. ఆయా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. విజయకుమార్‌శర్మ, ఎం.ఆర్.శర్మ, డి.ఎస్.ఎస్.ఎల్.సంధ్య న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు ఎ.వెంకటరమణ, సత్యనారాయణ, స్వాతి, సత్యకుమార్, రమాదేవి, కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలకు ఎంతో మేలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అక్కరమాని
- పెదజాలరిపేటలో 'గడప గడపకు..'



మహిళకు కరపత్రం అందిస్తున్న విజయనిర్మల

ఆరిలోవ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పేదవాడికి ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. 19వ వార్డు పెదజాలరిపేటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలు అందజేశారు. పథకాల వల్ల ఎలాంటి లబ్ధి కలుగుతుందో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ మత్స్యకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అండగా నిలిచారని, వేట విరామ సమయంలో రూ.10 వేలు అందజేస్తున్నారని చెప్పారు. పేదలకు మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామున లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

ఏయూ సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫారం పంపిణీ



సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫారం అందిస్తున్న ఆచార్య హేమచంద్రారెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెక్యూరిటీ విభాగంలో పని చేస్తున్న 115 మంది ఉద్యోగు లకు యూనిఫారం పంపిణీ చేశారు. బుధవారం ఏయూ పరిపాలన భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఉన్నత విద్యా మండలి చెర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి చేతుల మీదుగా నూతన దుస్తులతో పాటు 9 వస్తువులతో కూడిన యూనిఫారం కిట్‌ను సెక్యూరిటీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగాహేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆత్మ గౌరవంతో జీవనం సాగించాలన్నారు. విశ్వవిద్యాలయం కోసం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామ్మోహనరావు, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ముఖ్య భద్రతా అధికారి మహ్మద్ ఖాన్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య ఎ.పల్లవి పాల్గొన్నారు.

కేంద్రీయ వర్సిటీల్లో రిజర్వేషన్ కల్పించాలి



ప్రసంగిస్తున్న ఆచార్య వై.చిన్నారావు

ఏయూ క్యాంపస్: కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయాలని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ సంచాలకుడు ఆచార్య వై.చిన్నారావు కోరారు. బుధవారం ఉదయం ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇంక్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రిజర్వేషన్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ విత్ రిఫరెన్స్ టు ఎస్సీ, ఎస్టీ, ఇన్ సెంట్రల్ యూనివర్సిటీస్' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. సమాజంలో అన్ని వర్గాలతో సమానంగా అభివృద్ధి సాధించే దిశగా అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్ కల్పన జరిగిందన్నారు. ప్రస్తుతం రిజర్వేషన్ వ్యవస్థను పునః పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సీఎస్ఎస్ఈఈపీ సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



కొంచాడ రాజు(ఫైల్)

సీతమ్మధార: భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు ఒక కార్మికుడు మృతి చెందిన ఘటన ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధి సీతంపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం ఎల్లయ్యపేటకు చెందిన కొంచాడ రాజు(22) తాపీమేస్త్రిగా నగరానికి వలస వచ్చి ఆరిలోవలో నివసిస్తున్నాడు. సీతంపేట రాజేంద్రనగర్‌లో చేపడుతున్న మూడంతస్తుల భవన నిర్మాణంలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం పైఅంతస్తు పనుల నిమిత్తం కోలామ్స్ వేసేందుకు వినియోగించిన బాక్స్ బిగిస్తుండగా.. అతడు అదుపుతప్పి కిందకు పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో రక్తస్రావంతో కుప్పకూలిపోయాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ధరేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌పీఎల్‌లో అర్ధ సెంచరీల మోత



శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు



దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు



ఫైనల్స్‌కు చేరుకున్న ఎన్ఎస్ఆర్ఐటీ జట్టు

దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి ప్రీమియర్ లీగ్ తుది అంకానికి చేరుకుంది. బుధవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌ల్లో అర్ధ సెంచరీల మోతతో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఉదయం మూడో స్థానం కోసం మ్యాచ్‌లు జరగగా... మధ్యాహ్నం సెమీఫైనల్స్ జరిగాయి. వీటిలో బ్యాట్స్‌మెన్ అర్ధ సెంచరీలతో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించి తమ జట్లను ఫైనల్స్‌కు చేర్చారు. గురువారం ఉదయం జూనియర్స్ విభాగంలో జరిగే ఫైనల్ పోరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ (కంచరపాలెం), సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) తలపడనున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్ల మధ్య ఫైనల్స్ పోరు జరగనుంది. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

14 పరుగుల తేడాతో ఎస్ఎస్ఆర్ఐటీ విజయం

బుధవారం ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు (శొంఠ్యాం) 14 పరుగులు తేడాతో జీవీపీ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన జీవీపీ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీవీపీ కాలేజ్ 9.3 ఓవర్లలో 70 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

8 పరుగులు తేడాతో శ్రీ కాశ్యప్ విజయకేతనం

రెండో మ్యాచ్‌లో అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ (నర్సీపట్నం), శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ (శ్రీనగర్) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టపోయి కేవలం 65 పరుగులు మాత్రమే చేసింది. శ్రీ కాశ్యప్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.

9 వికెట్ల తేడాతో డైట్ కాలేజ్ భారీ విజయం

మధ్యాహ్నం జరిగిన తొలి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో రఘు ఇంజినీరింగ్ కాలేజ్(దాకమర్రి), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు (అనకాపల్లి) తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన రఘు ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 9 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 80 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్స్‌కు చేరుకుంది.

భారీ విజయంతో ఫైనల్‌కు ఎస్ఎస్ఆర్ఐటీ

మధ్యాహ్నం జరిగిన నాలుగో మ్యాచ్ సెమీ ఫైనల్స్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ 46 పరుగుల భారీ ఆధిక్యంతో శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్‌పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్ఎస్ఆర్ఐటీ జట్టు నిర్ణత 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 95 పరుగుల స్కోరు నమోదు చేసింది. భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 49 పరుగులు మాత్రమే చేయగలిగింది.

షాలిమార్ – తాంబరం స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): షాలిమార్–తాంబరం–షాలిమార్(08041/08042) వీక్లీ స్పెషల్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

రాంచీ – విల్లుపురం – రాంచీ మధ్య స్పెషల్స్

దక్షిణ భారతదేశంలోని వలస కార్మికుల సౌకర్యార్థం రాంచీ – విల్లుపురం – రాంచీ (08068 / 08067) మధ్య వీక్లీ స్పెషల్స్ నడుపుతున్నట్లు త్రిపాఠి తెలిపారు. ప్రతీ శుక్రవారం రాంచీలో మధ్యరాత్రి 11.55 గంటలకు బయల్దేరి దువ్వాడ మీదుగా ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విల్లుపురంలో ప్రతీ మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరి గురువారం ఉదయం 6.45కు రాంచీ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 28 వరకు నడుస్తుంది.

➡ మచిలీపట్నం – విశాఖపట్నం – మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కు మరో మూడు స్లీపర్ క్లాస్ కోచ్‌లను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

యూరోపియన్ సదస్సుకు అపోలో వైద్యుడు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఈ ఏడాది మే నెలలో జరగనున్న యూరోపియన్ వార్షిక సదస్సుకు హాజరు కావాలని హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్‌కు ఆహ్వానం అందింది. యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రమటాలజీ(ఎఫెర్ట్) ఆధ్వర్యంలో యూరప్ ఖండం వియన్నాలో ఈ సదస్సు జరగనుంది. అపోలోలో తాను విజయవంతంగా నిర్వహించిన రెండు సర్జరీలకు సంబంధించిన కథనాలపై ఈ సదస్సులో మౌఖిక ప్రదర్శన చేస్తానని ఖాన్ బుధవారం తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని వినతి

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమురు నాగేశ్వరరావును పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల మీద మంత్రికి వినతి పత్రం సమర్పించారు. తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న సుమారు 750 మంది అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

- ఆర్ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సన్నద్ధత చేసే క్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు బుధవారం వెబెక్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని ఆర్ఐవో కార్యాలయం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు ఆర్ఐవో వివరించారు. విశాఖలో 185, అనకాపల్లిలో 136, అల్లూరి జిల్లాలో 39 జూనియర్ కాలేజీల నుంచి మొదటి సంవత్సరం 56,437 మంది, రెండో సంవత్సరం 56,625 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్‌గా 8,116 మంది పరీక్షలకు ఫీజు చెల్లించినట్లు వివరించారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం తగిన సౌకర్యాలు ఉన్న కాలేజీలను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసేలా ఇప్పటికే కళాశాల ప్రిన్సిపాళ్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. అనకాపల్లి జిల్లా డీవీఈవో బి.సుజాత, కార్యాలయ పర్యవేక్షకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవని నిధికి 'ఇంటర్' విరాళం రూ.50 వేలు



కలెక్టర్ మల్లికార్జునకు చెక్ అందజేస్తున్న ఆర్ఐవో

విశాఖ విద్య: జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సంజీవని నిధికి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల తరఫున రూ.50 వేలను వితరణ ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు అందజేశారు. జిల్లాలోని 10 కాలేజీల నుంచి రూ.50 వేలు సేకరించగా, ఇందులో ఒక్క పెందుర్తి కాలేజీ నుంచే రూ. 20 వేలు ఇచ్చారు. నిరుపేదలకు ఆరోగ్య పరంగా అత్యవసర సమయంలో ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన సంజీవని నిధికి తోచిన రీతిలో వితరణ ఇచ్చేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ముందుకు వస్తుండటం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఈ విషయంలో చైతన్యం తీసుకొచ్చిన ఆర్ఐవోను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆలోచనలే జీవితాన్ని నిర్దేశిస్తాయి



మాట్లాడుతున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

కొమ్మాది: మన ఆలోచనలే మన జీవితాన్ని నిర్దేశిస్తాయని, అందుకే యువత ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సూచించారు. రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన ట్రైనింగ్ మిషన్ సంస్థ భవన్‌లో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 14వ గిరిజన యూత్ ఎక్స్‌చేంజ్ ప్రొగ్రాంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, నిరంతరం సాధన చేసిన నాడే ఉన్నత స్థానానికి చేరుకోగలరన్నారు. యువత నక్సలిజం వైపు, చెడు మార్గాల వైపు వెళ్లడానికి గల కారణాలను విశ్లేషిస్తూ వాటిని అధిగమించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. నెహ్రూ యువ కేంద్రం సంచాలకులు ఎ.విజయారావు, ట్రైనింగ్ సెంటర్ ఈడీ చినబాబు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా జీఎం రెడ్డి

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జి.మహేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023–24 సంవత్సరానికి సంఘం వార్షిక ఎన్నికలు ఈ నెల 24న నిర్వహించేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది.

ఈ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, క్రీడా, గ్రంథాలయ కార్యదర్శులు, సీనియర్ సభ్యులతో పాటు మహిళా ప్రతినిధిని, మరో 10 మంది సాధారణ సభ్యులను ఎన్నుకుంటారు. వివిధ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశారు.

విశాఖ టు ఢిల్లీ ప్రజాపోరు యాత్ర



ప్రజాపోరు యాత్రను ప్రారంభిస్తున్న మిట్ట రామారావు

సీతంపేట(విశాఖ ఉత్తర): కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని, దీనిపై ఈ పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పెట్టాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి ఢిల్లీ వరకు ప్రజాపోరు రథయాత్ర చేపట్టారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మిట్ట రామారావు, దళిత ద్రావిడ పార్టీ జాతీయ అధ్యక్షుడు మళ్ల జీవన్ కుమార్, సీఏపీఎస్ జాతీయ సలహాదారు ఆళ్ళ రామకృష్ణ జెండా ఊపి యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ డిమాండ్ సాధన కోసం గత ఐదేళ్లలో పాదయాత్ర, ప్రజా చైతన్య రథయాత్ర, జ్ఞానయుధ యాత్ర, ఢిల్లీలో మహాధర్నా నిర్వహించామని, 8 మంది ఎంపీలతో మాట్లాడినట్లు తెలిపారు. మిగతా ఎంపీలతో కూడా మాట్లాడి పార్లమెంట్‌లో బిల్లుపెట్టాలన్న లక్ష్యంతో ఇప్పుడు ప్రజాపోరు యాత్ర తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కంఠ వేణు, ఆతవ విజయభాస్కర్, చింతాడ రత్నం, గురుమూర్తి ప్రభాకర్, పిడుగు ఆశీర్వాదం పాల్గొన్నారు.

24 మంది సచివాలయ కార్యదర్శులకు మెమోలు

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2లో గల వివిధ వార్డు సచివాలయాల్లో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 24 మంది అడ్మిన్ సెక్రటరీలకు మెమోలు ఇచ్చినట్టు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. ఎన్నిసార్లు చెప్పినా వీరి పని తీరులో మార్పు రాకపోవడంతో మెమోలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సిటిజన్స్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చర్యలు చేపట్టారు. 10 సచివాలయాల్లో సున్నా రిజల్ట్ ఉండడంతో ఆగ్రహం వ్యక్త చేశారు. మార్పు రాకపోతే మరింత కఠిన చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి చెప్పారు.

4న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం 4న శనివారం నిర్వహించనున్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షన నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం పది గంటల నుంచి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.